
ర్యాలీలో పాల్గొన్న హనుమాన్ భక్తులు



కోఠి ప్రాంతంలో వీర హనుమాన్ విజయ యాత్ర దృశ్యాలు


కృష్ణారెడ్డినగర్‌లోని బాలాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న చిన్నారులు

జై హనుమాన్

- వాడవాడలా అన్నదానం కార్యక్రమాలు
- దారిపొడవునా సీసీ కెమెరాలతో ర్యాలీలను పరిశీలించిన పోలీసు బాస్‌లు

పాతబస్తీలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం కన్నులపండువగా జరిగాయి. ఉదయం నుంచి హనుమాన్ దేవాలయాల్లో పూజలు నిర్వహించిన యువకులు జైశ్రీరాం.. హనుమాన్‌జీకి జై.. అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. గౌలిగూడ రామ మందిర్ వద్ద కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ కొబ్బరికాయ కొట్టి వీర హనుమాన్ విజయయాత్రను ప్రారంభించారు. యాత్ర కోఠి ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా, సుల్తాన్‌బజార్, నారాయణగూడ, చిక్కడపల్లి, గాంధీనగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, కావడిగూడ, బైబిల్ హౌస్, ప్యారడైజ్‌ల మీదుగా తాడ్‌బన్ హనుమాన్ దేవాలయానికి చేరుకుంది. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా దక్షిణ మండలం పోలీసులు అదనపు బలగాలతో గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. దారిపొడవునా సీసీ కెమెరాలతో ర్యాలీలను పోలీసు బాస్‌లు పరిశీలించారు.పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి. భక్తులకు చల్లటి మంచినీరు, మజ్జిగ సరఫరా చేశారు. లంగర్‌హౌస్ త్రివేణి సంగం వద్ద ఉన్న 800 సంవత్సరాల పురాతన పంచముఖాంజనేయ స్వామి ఆలయంలో వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు.

– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం


గౌలిపురాలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న కాంతి కుమార్, జానకీరామ్, హరికృష్ణ


బజరంగ్ దళ్, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన హనుమాన్ యాత్ర బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, ఆలే భాస్కర్ రాజ్


రాజ నర్సింహా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న భక్తులు


హనుమాన్ జయంతి ర్యాలీలో పాల్గొన్న గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్


కేసరి హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహించిన ఠాకూర్ జీవన్‌సింగ్


హనుమాన్ జయంతి వేడుకల్లో పూజలు చేసిన మాణిక్ ప్రభు, ముక్క కృష్ణాగుప్తాలు


మాధవినగర్‌లో అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న బొడ్డు కోటేశ్వరరావు గుప్తా


వేదికపై ప్రసంగిస్తున్న వక్తలు


వీర హనుమాన్ విజయయాత్రకు బయల్దేరుతున్న భజరంగ్‌సేనా మహిళా విభాగం నాయకులు


పీపలేశ్వర్ ఆలయంలో జలమండలి డీజీఎం కిషోర్ పూజలు


గోల్కొండలో హనుమతుడికి పూజలు


దారుషిఫాలో ఏక్తా జనశక్తి ఫౌండేషన్ అధ్వర్యంలో పూజలు


హనుమాన్ యాత్రకు వెళ్తున్న లక్ష్మణ్‌రావు బృందం


పూజల్లో పాల్గొన్న కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్


గోషామహల్‌లో పూజలు చేసిన గడ్డం శ్రీనివాస్ యాదవ్


ఆగాపురాలో పూజలు చేస్తున్న బీజేపీ కన్వీనర్ పవన్‌కుమార్


రథోత్సవంలో పాల్గొన్న 12వ పీఠాధిపతి ప్రభుదత్త మహారాజ్


ప్రత్యేక అలంకరణలో ఇందిరానగర్ వీర హనుమాన్


మీరాలంమండిలో పూజలు అందుకున్న హనుమంతుడు


శక్కర్‌గంజ్‌లో బీఆర్‌ఎస్ నేత క్రాంతి కుమార్ పూజలు


శోభాయాత్రలో పాల్గొన్న మజ్లిస్ పార్టీ నాయకులు రాజేశ్వర్‌రావు

లోక్‌సభ బరిలో ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ


మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ

చార్మినార్: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉంటున్నారని ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ అధికార ప్రతినిధి మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ తెలిపారు. ఈ మేరకు తాను ఇప్పటికే చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గం నామినేషన్ దాఖలు చేసినట్లు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మొఘల్‌పురాలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి తాను పోటీ చేస్తున్నాన్నారు. మహారాష్ట్ర పర్బని నుంచి షేక్ సలీం, ఔరంగాబాద్ నుంచి సమద్ భాగ్‌వాన్, నాందేడ్ నుంచి హఫీజ్ సుల్తానా, హైదరాబాద్ నుంచి ఖాజా మోయినుద్దీన్, సికింద్రాబాద్ నుంచి రఫీయుద్దీన్ కలీంలు పోటీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

జియాగూడ ఆలయ ప్రధాన అర్చకుడు ఆచార్యులు మృతి

లక్డీకాపూల్: జియాగూడ శ్రీ రంగనాథ స్వామి దేవాలయం ప్రధాన అర్చకుడు శ్రీమాన్ శృంగారం రాజగోపాలాచార్యులు కన్నుమూశారు. శతాధిక ప్రతిష్టాపక యజ్ఞాచార్యులు, అలంకార భట్టర్ ఆచార్య గత కొంతకాలంలో అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధిలో ఆచార్యులు తన ముద్ర ఉందని గుర్తుచేసుకున్నారు. బుధవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు రాజగోపాలచార్యులు కుటుంబసభ్యులు తెలిపారు.

పోగొట్టుకున్న బంగారం రెండు గంటల్లో అందజేత


బాధితురాలికి బ్యాగ్‌ను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ సురేందర్

దూద్‌బౌలి: ఫిర్యాదు చేసిన రెండు గంటల్లోనే బాధితురాలి హ్యాండ్ బ్యాగ్‌ను తిరిగి అందజేసినట్లు హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్ కె.సురేందర్ తెలిపారు. మంగళవారం ఉదయం హుస్సేనీఆలంలో ఓ మహిళ తన బ్యాగ్ పోగొట్టుకుందని, అందులో తులం బరువున్న 5 బంగారు రింగ్స్‌తోపాటు రెండు వేల నగదు, ఒక సెల్‌ఫోన్ ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే సీసీటీవీ ఫుటేజీల ద్వారా బ్యాగ్‌ను కనిపెట్టి బాధితురాలికి అందజేసినట్లు చెప్పారు. ఆయనతోపాటు డీఐ కె.స్వామి ఉన్నారు.

విజయలక్ష్మీ వెంకటేశ శతకం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ కవుల సంఘం, కళాసూర్య కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత జనువాడ రామస్వామి రచించిన విజయలక్ష్మీ వెంకటేశ శతకం పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ తెలుగు భాష, కవిత, పద్య, ఛందస్సుల గొప్పతనం మరే ఇతర భాషలకు లేదన్నారు. అంతకు ముందు వివిధ అంశాలపై నిర్వహించిన కవి సమ్మేళనం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ప్రముఖకవి సుధామ, రచయిత విహారి, తెలంగాణ కవుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటనారాయణ, కళాసూర్య సంస్థ అధ్యక్షుడు ఎ.ప్రభాకరాచారి పాల్గొన్నారు.

పాత్రికేయులకు ఉగాది పురస్కారాల ప్రదానం


సీనియర్ పాత్రికేయుడు గురునాథ్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న గుత్తా

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా ప్రభావం పెరగడంతో తప్పుడు వార్తా కథనాలు అధికంగా వస్తున్నాయని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ధోరణి సమాజానికి మంచిది కాదన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో శృతిలయ ఆర్ట్స్ అకాడమి, సీల్‌వెల్ కార్పొరేషన్లల సంయుక్త ఆధ్వర్యంలో పలువురు పాత్రికేయులకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. సీనియర్ పాత్రికేయుడు సర్వసుది గురునాథ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, కేంద్ర ఉర్దూ భాషాభివృద్ధి మండలి సభ్యులు మహెక్ మూర్తిలతోపాటు పలువురు పాత్రికేయులు పురస్కారాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా, దర్శకుడు నర్సింగ్‌రావు, మహ్మద్ రఫీ, సంస్థ వ్యవస్థాపకులు కార్యదర్శి ఆమని తదితరులు పాల్గొన్నారు.

ఎవరి సెంటిమెంట్ వారిదే!

- సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మక్కా మసీదులో ప్రార్థనల అనంతరం నామినేషన్ దాఖలు
- నేడు బీజేపీ అభ్యర్థి మాధవీలత చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం నామినేషన్ దాఖలు
- హాజరుకానున్న కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కాయి. మజ్లిస్ పార్టీ సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాతబస్తీలోని అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా.. ఇటు బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత కూడా తన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఉత్సాహపూరిత వాతావరణంలో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. నామినేషన్ల దాఖలు సమయంలో మత విశ్వాసాలు, సెంటిమెంట్ల మేరకు అభ్యర్థులు ముందుకు సాగుతున్నారు. ఈ నెల 19న, సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మక్కా మసీదులో జుమ్మా సామూహిక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత బుధవారం ఉదయం 9.30 గంటలకు చార్మినార్ భాగ్యలక్ష్మీ మందిరంలో పూజలు నిర్వహించిన అనంతరం నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ పాల్గొనున్నారు. నగరంలోని అన్ని విభాగాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలి రానున్నారు.



జూ పార్కులోని పచ్చదనం


కలసి మెలసి భోజనాలు

జూ... జామ్!

జూ పార్క్‌కు పెరిగిన సందర్శకుల తాకిడి

చార్మినార్: ఆహ్లాదకర వాతావరణం.. ఆకట్టుకుంటున్న పచ్చిక బయళ్లు.. ఉదయం, సాయంత్ర వేళల్లో చల్లటి గాలులు.. కేరింతలు.. ఉల్లాసం.. ఉత్సాహం... చెట్ల కింద సహపంక్తి భోజనాలు.. ఇదీ నెహ్రూ జూపార్కులోని సోమవారం కనిపించిన దృశ్యాలు. మండే ఎండల నుంచి ఉపశమనం పొందడమేకాకుండా రకరకాల జంతువులు, పక్షులు, ఇతర జీవాలను చూసి ముచ్చటపడుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో జూ పార్కుకు సందర్శకుల తాకిడి పెరిగింది.


పచ్చికబయలులో ఉల్లాసంగా గడుపుతున్న చిన్నారులు


నీటితో సరదాగా ఆటలాడుతున్న చిన్నారులు

అత్యాచార కేసు నిందితుడికి జీవితకాల జైలు శిక్ష

లంగర్‌హౌస్: మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడికి జీవితకాలం జైలు శిక్ష విధించారు. లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ కేసు వివరాలను ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... లంగర్‌హౌస్ హషం నగర్‌లో నివాసముండే అతీఖ్‌ఖాన్(23) వృత్తిరీత్యా బైక్ మెకానిక్. 2021లో స్థానికంగా నివాసముండే బాలికపై అత్యాచారం చేశాడు. కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన నాంపల్లి 12వ అదనపు ఎంఎస్‌జె కం స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు జడ్జి అనిత మంగళవారం పోక్సో చట్టం కింద తీర్పు ఇచ్చారు. నిందితుడు అతీఖ్‌ఖాన్‌కు జీవిత ఖైదుతోపాటు 5 వేల రూపాయల జరిమానా విధించారు.

రూ.50 లక్షల హవాలా డబ్బు పట్టివేత

జియాగూడ: రూ.50 లక్షల హవాల డబ్బును తరలిస్తు న్న ఓ వ్యక్తిని ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న సంఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.... గౌలిగూడకు చెందిన కుమార్ (30) వృత్తిరీత్య బేగంబజార్‌లో కుమార్ జ్యువెలర్స్ పేరుతో వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం బేగంబజార్ నుంచి కుమార్ గౌలిగూడలోని ఇంటికి యాక్టివా ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అనుమానం వచ్చిన ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసు లు నిలిపి తనిఖీ నిర్వహించగా రూ.50 లక్షల నగదు ఆ వాహనంలో లభించింది. దీంతో తదుపరి విచా రణకు అఫ్జల్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. నగ దును సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్ తెలిపారు.

గృహిణిపై అత్యాచారానికి యత్నించిన ప్రభుత్వ ఉద్యోగి

జియాగూడ: గుడిసెలో ఒంటరిగా ఉన్న ఓ గృహిణిపై విద్యుత్‌శాఖ ప్రభుత్వ ఉద్యోగి అత్యాచారానికి యత్నించిన సంఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.రామస్వామి తెలిపిన వివరాల ప్రకారం... పోలీస్‌స్టేషన్ పరిధిలోని కార్వాన్ రాంసింగ్‌పురాలోని గుడిసెలలో ఉంటున్న ఓ గృహిణి (24)పై మధ్యాహ్నం కార్వాన్ విద్యుత్ కార్యాలయానికి చెందిన ఉద్యోగి రాజారావు అత్యాచారానికి యత్నించాడు. అదే సమయంలో గుడిసెకు వచ్చిన భర్త శేఖర్ వెంటనే గమనించి అతడిని పట్టుకుని కొట్టడానికి యత్నించగా పారిపోయాడు. దీంతో ఆ దంపతులు కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అబిడ్స్‌లో రూ.65 లక్షలు పట్టివేత

అబిడ్స్: అబిడ్స్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఎంజే మార్కెట్ వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.65 లక్షల నగదు పట్టుపడింది. మంగళవారంరాత్రి ఒక వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయటంతో అందులో రూ.65 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలులేక పోవటంతో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుపడిన ఈ నగదును ఒక ప్రముఖ వ్యాపారి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, పోలీసులు మాత్రం ఆ వ్యాపారి పేరును బయట పెట్టకుండా గోప్యంగా ఉంచుతున్నట్లు సమాచారం.

ప్రశ్నించే గొంతుకకు ఓటు వేయండి: అక్బరుద్దీన్


గోల్కొండలో జరిగిన ఎన్నికలసభలో మాట్లాడుతున్న అక్బరుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: పార్లమెంట్‌లోగానీ, అసెంబ్లీలోగానీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే పార్టీ మజ్లిస్ ఒక్కటే అని, దానికే ఓటు వేయాలని ఆ పార్టీ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. మంగళవారం గోల్కొండ బడాబజార్‌లో జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. మైనార్టీలు, దళితులపై దేశంలో ఎక్కడ దాడులు జరిగినా తమ పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటులో నిలదీస్తారని అన్నారు. మజ్లిస్ కేవలం ముస్లిం, మైనార్టీల పక్షాన ఉండదని, దళితులు, అణగారిన వర్గాలు, బీసీల హక్కుల సాధనకు అండగా ఉంటుందన్నారు. హైదరాబాద్ ప్రజలు తమను ఓటు వేసి గెలిపిస్తున్నారంటే తమ పనివిధానం ప్రజలు మెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. మజ్లిస్ పార్టీ అధ్యక్షుడుగా హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అసదుద్దీన్ ఒవైసీ చేయించిన అభివృద్ధి పనులు మజ్లిస్ వ్యతిరేకులకు కానరావడం లేదని ఎద్దేవా చేశారు. కార్వాన్ నియోజకవర్గంలో ప్రభుత్వ బాలికల జూనియర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలు మజ్లిస్ పార్టీ కృషి వల్లే స్థాపించినట్లు చెప్పారు. నగరానికి దళిత మేయర్‌ను అందించిన ఘనత తమ పార్టీదేనన్నారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, కార్పొరేటర్ నసీరుద్దీన్, నాయకుల హారూన్ ఫరాన్, ఏకే పఠాన్ తదితరులున్నారు.

మజ్లిస్ ఇంటింటి ప్రచారం


ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ తదితరులు

గోల్కొండ: మజ్లిస్ సెక్యూలర్ పార్టీ అని, అది అభివృద్ధి పనులకే పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన రేశంబాగ్, అటారా సిటీ, ఫ్రన్ కాటేజీ, గోల్కొండ కోట మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మజ్లిస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మజ్లిస్ పార్టీ చేసిన అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గోల్కొండలో ఎటువంటి సమస్యలు లేవని అన్నారు. తాగునీటి కొరతలేదని, ప్రధానరోడ్లతోపాటు అంతర్గత రోడ్లు సైతం అభివృద్ధి చేయించామని చెప్పారు. హైదరాబాద్ లోక్‌సభ మజ్లిస్ పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ ఎంపీ లాడ్ నిధులతో కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయని, కొత్త కాలేజీలను స్థాపించామని చెప్పారు. నియోజకవర్గంలో నీటి ఎద్దడిని తీర్చడానికి ఓవర్‌హెడ్ ట్యాంకర్లు సైతం ఎంపీ నిధులతో నిర్మించినట్లు వివరించారు. ఆయన వెంట మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు అజీజ్ ఖాన్ పఠాన్, సయ్యద్ ఆజామ్, ఎంఏ రహీం, షబ్బీర్‌ఖాన్, మహ్మద్ ముజీబ్ తదితరులున్నారు.

వాతావరణాన్ని తట్టుకోగల విత్తనాలపై వర్క్‌షాపు


వర్క్‌షాపులో పాల్గొన్ననీరజా ప్రభాకర్, తారా సత్యవతి

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రీడా–ఐసీఏఆర్)లో మంగళవారం వాతావరణాన్ని తట్టుకోగల పంటల విత్తనాలను ప్రోత్సాహించడంపై ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యు వైస్ చాన్సిలర్ డాక్టర్ బి.నీరజా ప్రభాకర్, హైదరాబాద్ ఐసీఏఆర్–ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సి.తారా సత్యవతి, హైదరాబాద్ ఏటీఏఆర్ఐ జోన్–ఎక్స్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా, ఐఎఫ్ఎఫ్‌సీఓ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపా శంకర్, నాబార్డ్ డీజీఎం స్వాతి తివారీతోపాటు క్రీడా, ఐసీఏఆర్ నుండి శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడా–ఐసీఏఆర్ డైరెక్టర్ వి.కె.సింగ్ స్వాగత ప్రసంగంలో డ్రైల్యాండ్ పరిశోధనలో క్రీడా అందించిన సహకారాన్ని హైలెట్ చేశారు. స్థిరమైన వ్యవసాయం కోసం వాతావరణాన్ని తట్టుకునే పంటలు, రకాలను ప్రోత్సాహించాలన్నారు. అనంతరం డాక్టర్ నీరజా ప్రభాకర్ మాట్లాడుతూ వాతావరణాన్ని తట్టుకోగల రకాలను అభివృద్ధి చేసి అందించడం ద్వారా ఆహార భద్రతను తీర్చాలన్నారు. ద్వితీయ వ్యవసాయంపై దృష్టి పెట్టి... పోషక భద్రతను పొందాలని సూచించారు.